# మరణశిక్ష ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం

వార్త
4/3/96
విజయవాడ

(అమర్తలూరి రత్నప్రసాద్)

గుంటూరు, మార్చి 3 (ప్రభాతవార్త):

**"హంతకుడంటే మనిషి ప్లస్ హత్య, హత్యను శిక్షించి, మనిషిని మిగిలిస్తేనే నిజమైన న్యాయం జరుగుతుంది"**

**వి.ఆర్.కృష్ణయ్యర్, సుప్రింకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి**

మరణ శిక్ష రద్దు కోసం భారత దేశంలో చాలా రోజుల నుంచి పౌరహక్కుల సంస్థలు ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయి. మరణ శిక్ష విధించడం సమస్యలకు పరిష్కారం కాదని వారు వాదిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో సంచలనం సృష్టించిన చిలకలూరిపేట బస్సు దగ్ధం కేసులో నిందితులకు గుంటూరు జిల్లా కోర్టు ఉరిశిక్ష విధించగా, హైకోర్టు దీనిని ధృవీకరించింది. అయితే రాష్ట్ర పౌరహక్కుల సంఘం ఈ తీర్పును సుప్రింకోర్టులో సవాలు చేసి 'స్టే' తెచ్చింది. రాష్ట్ర పౌరహక్కుల సంస్థ ఈ సంఘటన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మరణ దండనకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు రంగంలోకి దిగింది. చిలకలూరిపేట కేసులో నిందితులకు ఉరిశిక్ష విధించడం సరైందేనని ప్రజలు భావిస్తున్నప్పటికీ, ఇది అప్రజాస్వామికమైన అభిప్రాయమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.బాలగోపాల్ అన్నారు. "కంటికి కన్ను, పంటికి పన్ను, హత్యకు మరో హత్య విధించే న్యాయం ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం" అని డాక్టర్ బాలగోపాల్ 'వార్త'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అన్నారు. డాక్టర్ బాలగోపాల్ ఇటీవల గుంటూరు వచ్చిన సందర్భంగా 'ప్రభాతవార్త' చేసిన ఇంటర్వ్యూ ఈ విధంగా సాగింది.

ప్రశ్న: 23 మంది అమాయక పౌరులను సజీవ దహనం చేసిన కేసులో నేరస్తులకు ఉరిశిక్షను విధించరాదని మీరెలా అనగలరు?

బాల: ఎవ్వరికీ ఏ నేరానికి ఉరి తీయకూడదని మేము అంటున్నాం. ఇది ఒక కేసుకు, ఒక ముద్దాయికి సంబంధించిన విషయం కాదు. శిక్షాస్మృతిలో ఉరిశిక్ష అనేదే ఉండకూడదని పౌరహక్కుల ఉద్యమం అభిప్రాయం. ఉరిశిక్షల పూర్తి రద్దు గురించి ప్రపంచ వ్యాప్తంగా చాలా చర్చ జరిగింది. చాలా దేశాలు ఉరిశిక్షను పూర్తిగా రద్దు చేశాయి. మరికొన్ని దేశాలు కేవలం యుద్ధ సమయంలో జరిగే నేరాలకే తప్ప సాధారణ సమయంలో జరిగే హత్యలకు ఇతర నేరాలకు ఉరిశిక్షను రద్దు చేశాయి. ఇక్కడ సమస్య ఘోరమైన నేరాలు జరుగుతున్నాయా లేదా అనేది. సమాజంలో చాలా ఘోరమైన నేరాలు జరుగుతున్న మాట నిజమే. చిలకలూరిపేట ఘటన చాలా ఘోరమైన నేరమే. కాని ఇక్కడ చర్చ నేరాల గురించి కాదు. శిక్షల గురించి. నేరాలు ఘోరంగా ఉన్నాయని శిక్షలు ఘోరంగా ఉండాలా? కాలు నరికిన వాడికి కాలు నరకడమే శిక్ష అని ఎవ్వరూ అనరు. జైలు శిక్షే దానికి తగిన శిక్షఅని ఒప్పుకుంటాను. కాని హత్యా నేరం విషయంలో చంపిన మనిషికి చావే శిక్షఅంటారు. కంటికి కన్ను, పంటికి పన్ను అనే శిక్షా విధానం ఆదిమ ప్రతీకార నీతికి ఆఖరి అవశేషం.

ప్రశ్న: వారిద్దరి ఉరిశిక్షకు ప్రజామోదం ఉంది కదా! దాన్ని వ్యతిరేకిస్తున్న మీ సంస్థ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్టు కాదా?

బాల: ప్రజామోదం ఉన్న అన్ని విషయాలను అంగీకరించడం ప్రజాస్వామ్య దృక్పథం కాదు. ప్రజాస్వామ్య విలువలు, ప్రమాణాలు ప్రజాస్వామిక దృక్పథానికి ప్రాతిపదిక. ప్రజాభిప్రాయం అప్రజాస్వామికంగా ఉంటే ప్రజాభిప్రాయాన్ని మార్చడానికి ప్రయత్నం చేయడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం అవుతుంది. హత్యకు కేవలం హంతకుడిని పూర్తిగా బాధ్యుడ్ని చేసి పరిహారం మొత్తం అతనే చెల్లించాలని భావించడం ప్రజాభి

## డాక్టర్ బాలగోపాల్‌తో ఇంటర్వ్యూ



ప్రాయంలోని తప్పుడు ధోరణులలో ఒకటి. చిలకలూరిపేట కేసులో బాధ్యత కేవలం విజయవర్ధనరావు, చలపతి రావులదేనా? నేరానికి సామాజిక వ్యవస్థ బాధ్యత ఎంత, నేరస్తుడి బాధ్యత ఎంత అనేది చూడాలి. వ్యక్తి బాధ్యత ఉన్న మేరకు వ్యక్తికి శిక్ష, సమాజం బాధ్యత ఉన్న మేరకు సమాజానికి శిక్ష వేసే చట్టాలుంటే బాగుండేది. ఉదాహరణకు నేరానికి పాల్పడినందుకు చలపతిరావు, విజయవర్ధనరావులకు శిక్ష వేసినట్టే వాళ్ల పేదరికానికి, నిస్పృహకు కారణమైన సామాజిక ఆర్థిక వ్యవస్థకు శిక్ష ఎందుకు వేయకూడదు? వాళ్లు జైలులో ఉన్నంత కాలం వాళ్ల కుటుంబాలను ప్రభుత్వం ప్రజా ధనంతోనే పోషించాలన్న చట్టం ఎందుకు ఉండకూడదు. వాళ్లిద్దరికీ జైలు శిక్ష వేయడాన్ని పౌరహక్కుల సంఘం వ్యతిరేకించడం లేదు. కాని తప్పంతా వాళ్లమీదే నెట్టి ఉరిశిక్ష వేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రజలు కూడా ఈ విషయాన్ని గురించి ఆవేశాలు పక్కకు పెట్టి ఆలోచిస్తారని ఆశిస్తాం.

ప్రశ్న: మరణశిక్షను ఒక శిక్షా పద్ధతిగా వ్యతిరేకించడానికి కారణాలేమిటి?

బాల: మరణ శిక్షను వ్యతిరేకించడానికి కారణమేమిటి అనే ప్రశ్న వేసుకునే ముందు మరణ శిక్షను సమర్థించడానికి కారణమేమిటో చూడాలి. ఈ విషయాన్ని గురించి న్యాయశాస్త్రంలో చాలా వివరమైన చర్చ జరిగింది. ఒకరి ప్రాణం నేను తీస్తే నా ప్రాణం కూడా పోతుందన్న భయం మనుషుల లో ఉంటే తప్ప హత్యా నేరాలు ఆగవనేది ముఖ్యమైన వాదన. ఇదిపైకి సహేతుకంగానే కనిపిస్తుంది. కాని ఇది నిజంగా సహేతుకమైన వాదనేనా? ప్రపంచంలో చాలా దేశాలు మరణ దండనను పూర్తిగా రద్దు చేశాయి. ఆ దేశాలలో మరణ దండనను రద్దు చేసిన తరువాత హత్యా నేరాల సంఖ్య పెరిగిందా? ఈ విషయంలో పరిశోధనలు జరిగాయి. రద్దుకు ముందు, తరువాత హత్యా నేరాల ఉధృతిలో తేడా ఏమీలేదని పలు పరిశోధనలు తేల్చాయి. చాలా మంది భయపడుతున్నట్టు మరణదండనను నిషేధించిన దేశాల సమాజాలు అతలాకుతలం అయిపోలేదు. అభద్రతతో విలవిలలాడడం లేదు. ఉరిశిక్షను మేము వ్యతిరేకించడానికి మరొక ముఖ్యమైన కారణం ఉంది. న్యాయమూర్తులు, కోర్టులు తప్పులకు అతీతమేమీకాదు. తప్పుడు సాక్ష్యాలతో కేసులు రుజువు చేసే ప్రయత్నం మన పోలీసు వ్యవస్థకు కొత్తకాదు. పొరబాటుగా ఒక వ్యక్తికి శిక్షవేసే ప్రమాదం ఉన్నపుడు ఆ పొరబాటును గ్రహించిన తరువాత శిక్షని వెనక్కు తీసుకునే అవకాశం ఉండాలి. కాని ఉరితీసిన ప్రాణాన్ని వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదు.

ప్రశ్న: అన్యాయానికి తగిన పరిహారం చెల్లించకపోతే సమాజం నైతిక ఆవేదన చల్లారుతుందా?

బాల: తప్పు చేసిన వాళ్లు సులభంగా తప్పించుకుంటే సమాజం నైతికంగా నిస్పృహకు లోనవుతుందనేది కదా మీ ప్రశ్న. కంటికి కన్ను తీస్తే తప్ప చల్లారని ఆవేశం అసలు నైతికమే కాదు. ఇది నిజానికి ఆదిమ ప్రతీకర సిద్ధాంతానికి కొత్తరూపం మాత్రమే. తప్పుచేసిన వ్యక్తిని సంస్క

రించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా తయారుచేసి బయటకు పంపే శిక్షాస్మృతే నిజంగా నైతికమైంది.

ప్రశ్న: ఇలాంటి నేరస్తులను వదిలేస్తే భవిష్యత్‌లో అలాంటి నేరాలు జరిగే అవకాశం ఉంటుంది కదా?

బాల: నేరాలు జరగడానికి, జరగకపోవడానికి అనేక కారణాలుంటాయి. మనిషి మానసిక స్థితి నుంచి ఆర్థిక, సామాజిక ఒత్తి డుల దాకా అనేక కారణాలుంటాయి. వాటినన్నింటిని పక్కన బెట్టి శిక్ష క్రూరత్వాన్ని బట్టి నేరాల పరిమాణం ఉంటుందని వాదించడం అశాస్త్రీయమైన వాదన. ఒకరికి శిక్ష వేస్తే మరొకరు భయపడతారనే వాదన నిర్హేతుకమే గాక అవాస్తవికం కూడానని పరిశోధనలు తెలిపాయి. 1948 సంవత్సరం బ్రిటన్‌లో రాయల్ కమిషన్ ఉరిశిక్ష పడిన 168 మందిని ప్రశ్నించగా వారిలో 164 మంది గతంలో ఒక బహిరంగ ఉరిని కళ్లారా చూసిన వారేనని తేలింది. అయినప్పటికీ వాళ్లు మళ్లీ మరణదండనకు గురయ్యే నేరమే చేశారు.

ప్రశ్న: చిలకలూరిపేట కేసు ముద్దాయిలు సాధారణ నేరస్తులు కదా! ఉద్యమకారులు కాని నక్సలైట్లు కాని కాదు. మీ సంస్థ ఇంత ఆసక్తి చూపడానికి కారణమేమిటి?

బాల: ఉద్యమకారుల హక్కులకు, నక్సలైట్ల హక్కులకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలనేది పౌరహక్కుల ఉద్యమం అభిప్రాయం కాదు. అది మా గురించి ప్రచారంలో ఉన్న దురభిప్రాయం మాత్రమే. మేము ఒక విషయంలో ఇమిడి ఉన్న విలువలను బట్టి స్పందిస్తాము తప్ప దానివల్ల ఎవరికీ ప్రయోజనం కలుగుతుందనే దాన్ని బట్టికాదు.

ప్రశ్న: భూమయ్య, కిస్టాగౌడ్‌ల ఉరిశిక్ష విషయంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన వచ్చింది. కాని చిలకలూరిపేట నేరస్తులకు కనీసం సానుభూతి కూడా రావడం లేదు. ఎందుకని?

బాల: ప్రజల స్పందన అనేది సంఘటన స్వభావాన్ని బట్టి ఉంటుంది. రెండు సంఘటనలు ఒకే రకమైనవి కావు. పైగా భూమయ్య, కిస్టాగౌడ్‌ల విషయంలో ప్రజాందోళన నిర్మించడానికి వారికి అండగా ఒక బలమైన రాజకీయ ఉద్యమం ఉండింది. విజయవర్ధనరావు, చలపతిరావులకు అటువంటి అండలేదు. అయినప్పటికీ ప్రజాభిప్రాయం కలిగించడానికి మా వంతుగా మేము ప్రయత్నం చేస్తున్నాం.

ప్రశ్న: మరణశిక్షను ఏ సోషలిస్టు దేశాలైనా రద్దు చేశాయా?

బాల: ఒక్క తూర్పు జర్మనీ మాత్రమే ఆఖరి రోజులలో రద్దు చేసినట్టుంది. వేరే ఏ సోషలిస్టు దేశమూ చేయలేదు. చైనాలో హత్యా నేరానికే కాక ఇతర నేరాలకు కూడా మరణదండన విధిస్తున్నారు. ఆధునిక కాలంలో హత్యా నేరానికే కాక ఇతర నేరాలకు కూడా మరణదండన విధించిన కొద్ది దేశాలలో చైనా ఒకటి. సోషలిస్టు దేశాలలో కూడా మరణదండన రద్దు చేయాలని మేము కోరుతున్నాం.

ప్రశ్న: నక్సలైట్లు కూడా ప్రజాకంటకులు, పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరుతో కొందరిని చంపుతున్నారు కదా, దీన్ని మీరెందుకు వ్యతిరేకించరు?

బాల: నక్సలైట్ ఉద్యమాన్ని మేమొక రాజకీయ ఉద్యమంగా భావిస్తున్నాం. పీడిత ప్రజల సమస్యల నుంచి పుట్టిన రాజకీయ ఉద్యమంగా గుర్తిస్తున్నాం. దాని అర్థం వాళ్లు చేసే అన్ని చర్యలు సమర్థనీయం కాదు. వాళ్లు విచ్చలవిడిగా, విచక్షణా రహితంగా, అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తే పౌరహక్కుల ఉద్యమం విమర్శిస్తుంది, వ్యతిరేకిస్తుంది. అయితే వారి చర్యలను రాజ్యం చర్యలతో సమానంగా చూడము. వారు ఒక వ్యక్తిని బంధీగా తీసుకుని చంపడం, కోర్టు ఒక ముద్దాయికి మరణదండన విధించడం ఒకే కోవకు చెందిన ఘటనలు కావు. నక్సలైట్లు బంధీలుగా తీసుకున్న వ్యక్తులపైన, విచారణ జరిపే పద్ధతుల గురించి, విధించే శిక్షల గురించి చర్చ జరగవలసిన అవసరం ఉంది. అయితే అధికార శిక్షాస్మృతిని గురించి చర్చించే ప్రాతిపదికపైననే దానికి గురించి చర్చించడం ఉచితం కాదు. దానికి సంబంధించిన ప్రాతిపదిక రూపొందించుకోవాలి. ఆ పని పౌరహక్కుల ఉద్యమం చేయవలసి ఉంది. ఇప్పటికింకా చేయలేదు.

ప్రశ్న: బహుశా చుండూరు మారణకాండకు బాధ్యులైన అగ్రకుల నేరస్తులకు కోర్టు ఉరిశిక్ష విధిస్తే మీరు దాన్ని కూడా వ్యతిరేకిస్తారా?

బాల: ఖచ్చితంగా వ్యతిరేకిస్తాం. మేము సూత్రరీత్యానే ఉరిశిక్షకు వ్యతిరేకులం. ఒక విషయంలో మినహాయింపు ఇస్తే, రాజ్యానికి చట్టబద్ధంగా మనుషులను చంపే అధికారం కట్టబెట్టడం అవుతుంది. అది చివరకు దళితులకు, పేదలకే మంచిది కాదు.

ప్రశ్న: ప్రపంచ వ్యాప్తంగా మరణశిక్షను రద్దు చేసిన దేశాలేమైనా ఉన్నాయా? అన్నడ ఫలితాలెలా ఉన్నాయి?

బాల: 1989 గణాంకాల ప్రకారం ప్రపంలో 35 దేశాలు మరణదండనను పూర్తిగా రద్దు చేశాయి. మరొక 18 దేశాలు యుద్ధనేరాల వంటి వాటికి తప్ప మామూలు నేరాలకు (హత్యా నేరాలతో సహా) ఉరిశిక్షను రద్దు చేశాయి. మరొక 27 దేశాలు చట్టంలో రద్దు చేయకపోయినా ఆచరణలో ఉరిశిక్షను విధించడం మానివేశాయి.

పూర్తిగా రద్దు చేసిన దేశాలలో ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, డెన్మార్క్, పోర్చుగల్, స్వీడన్, నెదర్లాండ్స్, ఐస్‌లాండ్, ఫిలిప్పీన్స్, ఫిన్లాండ్ మొదలైనవి ఉన్నాయి. ఈ దేశాల అనుభంలో మరణదండన రద్దు చేసిన తరువాత హత్యానేరాలేం పెరగలేదు. సామాజిక జీతితం ఛిన్నాభిన్నం అయిపోలేదు. ఉదాహరణకు కెనడాలో 1976లో ఉరిశిక్షను రద్దుచేశారు. అంతకుముందు ఏడాది లక్ష మంది జనంలో 3.09 శాతం హతులయ్యారు. 1983లో అంటే ఉరిశిక్ష రద్దయిన ఎనిమిదేళ్ల తరువాత ఆ రేటు 2.74గా ఉంది. 1984లో అంతకు ముందు కంటే తక్కువ సంఖ్యలో హత్యలు జరిగాయి.

"లెట్ అజ్ స్టాండ్ ఫర్ లివ్

బట్ నాట్ ఫర్ డెత్" అంటూ ముగించారు డాక్టర్ బాలగోపాల్.

4/3/96 వార్త (Daily)
VIJAYAWADA Ed.